ప్రమాదమని తెలిసినా... పట్టించుకోరా ?

● బల్దియా తీరుపై 12వ డివిజన్ కార్పొరేటర్ ఆగ్రహం

మాట్లాడుతున్న కార్పొరేటర్

కోల్‌సిటీ, మే 20: రామగుండం నగర పాలక సంస్థ 12వ డివిజన్‌లో ప్రధాన నాలాలు పూర్తిగా సిల్ట్‌తో నిండిపోయి ప్రమాదకరంగా ఉందని చెబుతున్నా పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ తెలిపారు. ఈమేరకు డివిజన్ ప్రజలతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. గతంలో ప్రతి వేసవిలో ఈ సిల్ట్ తొలగించి వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా చూసేవారనీ, గత నాలుగు నెలలుగా స్వయంగా కమిషనర్‌ను కలిసి సిల్ట్ తొలగించాలని లేదంటే వర్షాలు పడితే చాలా ప్రమాదం ఉంటుందని విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్పొరేటర్లకు కనీస గౌరవం కూడా దక్కడం లేదన్నారు. ప్రధాన కాలువలు చెత్త, సిల్ట్‌తో నిండి దుర్గంధం వెదజల్లడమే గాకుండా వర్షాలు పడిన సమయంలో ఇండ్లలోకి డ్రైనేజీ నీరు వస్తుందని, దుర్వాసన, దోమల వృద్ధితో అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కన్నారు. బల్దియా అధికారులు బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను విన్నవించడానికి వెళ్తే ప్రతిపక్ష కార్పొరేటర్లను చులకన చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి త్వరితగతిన నాలాల సిల్ట్ తొలగింపు పనులకు ఆదేశించాలని లేదంటే బల్దియా కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బస్తీ ప్రజలు సందవేన కుమార్, రావుల మల్లయ్య, మేరుగు లింగయ్య, క్రాంతి, కార్తీక్, పిట్టల సురేశ్, మల్లయ్య, నెల్లి వంశీ, ఆకుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ ఆర్‌సీ,అధ్యక్షుడిగా నూతన నియమాకం

ప్రమాణం చేస్తున్న సురేందర్ గౌడ్,శ్రీనివాస్

ధర్మారం, మే20: మండలంలోని అలయన్స్ క్లబ్‌కు ఆర్‌సీ,అధ్యక్షుడిని ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ సోమవారం ప్రకటించారు. కొత్తూరు గ్రామానికి చెందిన తాళ్లపల్లి సురేందర్ గౌడ్ ఇది వరకు మంచిర్యాల జిల్లా 258 క్లబ్‌కు జోన్ చైర్మన్ వ్యహరించి పలు క్లబ్‌లను ఏర్పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించగా ఆయన సేవలను గుర్తించి రీజినల్ చైర్మన్‌గా పదోన్నతిని కల్పించారు. మండల కేంద్రానికి చెందిన మామిడిశెట్టి శ్రీనివాస్‌ను మండల క్లబ్ చైర్మన్‌గా నియమించారు. కరీంనగర్‌లోని జరిగిన క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమంలో సురేందర్ గౌడ్, శ్రీనివాస్ ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సురేందర్ గౌడ్,శ్రీనివాస్‌కు క్లబ్ పిన్స్‌ను సత్యనారాయణ అందజేసి అభినందించారు. సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సత్యనారాయణ సూచించారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

కాల్వశ్రీరాంపూర్, మే20: వానకాలం పంటకు గాను రైతులకు కాల్వశ్రీరాంపూర్ సహకార సంఘం కార్యాలయంలో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగార్జున పత్రికాప్రకటనలో తెలిపారు. 167 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీపై 30కిలోల బస్తా ధర రూ.1116. చెల్లించి తీసుకుపోవాలని సూచించారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకంతో పాటు, ఆధార్‌కార్డు తీసుకురావాలని వివరించారు. బస్తా 2.20 ఎకరాలకు సరిపోతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

● అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

కలెక్టరేట్ వద్ద స్వర్ణోత్సవాల టార్చ్‌తో కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది

పెద్దపల్లి, మే 20: కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాలలో పరిజ్ఞానాన్ని అందించి, పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, పంట దిగుబడిలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. భారతదేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిసి స్వర్ణోత్సవాలకు సంబంధించిన టార్చ్‌ను అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. తదేశంలో డాక్టర్ మోహన్ సింగ్ మెహతా కమిటీ సిఫారసు మేరకు తొలిసారి కృషి విజ్ఞాన కేంద్రాన్ని పాండిచ్చేరిలో 1974 మార్చి 21న స్థాపించారని తెలిపారు. అప్పటి నుండి ఇప్పటి వరకు దేశంలో 731 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు నూతన వంగడాలను పండించి అందించడమే కాకుండా క్షేత్ర పరిశీలనలు, శిక్షణ కార్యక్రమా నిర్వహణ పత్రిక మాధ్యమాల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నాయని, రైతులకు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు నేర్పుతారని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న స్వర్ణోత్సవాల సందర్భంగా శాస్త్రవేత్తల బృందాన్ని అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆది రెడ్డి, రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఖిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డాక్టర్ వై వెంకన్న, బీ భాస్కర రావు , డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ కిరణ్, బీ నవ్య, డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు

పెద్దపల్లి, మే 20: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1వ, 2వ, 4వ, 7వ స్థాయీ సంఘం సమావేశం జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అధ్యక్షతన, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 3వ, 5వ, 6వ స్థాయి కమిటీ సమావేశం సంబంధిత స్థాయి సంఘం అధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యులు, సంబంధిత అధికారులు సకాలంలో సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ధర్మారం,మే20: పత్తిపాక శివారులోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహోత్సవాలకు హాజరు కావాలని ఆలయ ధర్మకర్తలు ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరారు. ఈనెల 21 నుంచి23 వరకు స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విప్ లక్ష్మణ్ కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఉత్సవాలతో పాటు 23న రథోత్సవానికి హాజరు కావాలని కోరారు. ఇక్కడ పత్తిపాక సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ నీలం నర్సయ్య,విండో డైరెక్టర్ బద్దం రవీందర్ రెడ్డి,ఆలయ ధర్మకర్తలు ఏదుల్ల అంజయ్య,బద్దం మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఓదెల, మే 20: జీలకుంట గ్రామంలో వడదెబ్బ, పరిసరాల పరిశుభ్రత, భేటి బచావో భేటి పడావో కార్యక్రమాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సోమవారం ఆటపాటల ద్వారాప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు మధ్యాహ్నం వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పాటల రూపంలో అవగాహన కల్పించారు. అలాగే ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండడానికి పరిసరాల శుభ్రతగా ఉంచుకోవాలని సూచించారు. బాలికల చదువు ప్రాధాన్యతను పాటల రూపంలో వివరించారు. బాలికలను చిన్న చూపు చూడకుండా ఉన్నతంగా చదివించాలని సూచించారు. తమ కళా ప్రదర్శన ద్వారా ఆయా అంశాల పై కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, బుర్ర శంకర్‌గౌడ్, ఈదునూరి పద్మ, కొండ్ర వెంకన్న, ఇల్లందుల మల్లేశం, సలేంద్ర రాజన్న, జిన్నా రమ, దీకొండ శ్రావణ్, రేణుక పాల్గొన్నారు.

కలుషిత నీటితో అనారోగ్యం

రామగిరి, మే 20: సింగరేణి కార్మిక కుటుంబాలకు సరఫరా అవుతున్న తాగునీటితో అనారోగ్యం బారిన పడుతున్నారని సీఐటీయూ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య ఆరోపించారు. యాజమాన్యం కార్మిక కుటుంబాలకు అంది స్తున్న మంచినీరు కెమికల్‌తో కలుషితమైన ఓసీపీ-1, మైన్ మురుగు స్టాక్ వాటర్ సప్లయ్ చేసే పద్ధతి విధానంతో కార్మిక కుటుంబాలు అనారోగ్యం పాలై అవస్థలు పడుతున్నారని, అధికారుల ఉత్పత్తి, ఉత్పాదకతపై చూపిస్తున్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై చూపించడం లేదని విమర్శించారు. ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో బోర్లు వేసి శుద్ధమైన జలం అందించాలని కోరారు.

ఈ సెట్ ఫలితాల్లో నాగారం విద్యార్థిని ప్రతిభ

సుస్మిత

మంథని రూరల్, మే20: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రాం సుస్మిత ఈ సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటింది. సోమవారం వెల్లడించిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 40వ ర్యాంకు, సివిల్ బ్రాంచ్ విభాగంలో 7వ ర్యాంకు సాధించింది. సుస్మిత వరంగల్‌లోని ప్రభుత్వ కళాశాలలో పాలిటెక్నిక్ పూర్తి చేసింది.ర్యాంకు సాధించడంపై తల్లి దండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, మే20: 2024-25 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు జిల్లాలోని గిరిజన విద్యార్థులు వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 5 సీట్లు కాగా, మూడో తరగతిలో లంబాడ బాలికలు, బాలురు, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున, ఐదో తరగతిలో గోండు బాలురు, 8వ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రూ. 2 లక్షలు, రూరల్ ప్రాంతంలో రూ. 1. 50 లక్షలు ఉండాలన్నారు. ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫొటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6లోగా కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల నుంచి జూన్ 12న లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. వివరాలకు 9652118867లో సంప్రదించాలని సూచించారు.

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలకు..

పెద్దపల్లిరూరల్, మే 20: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం కోసం ఆసక్తి గల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికిగాను మహిళాశిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో బాల పురస్కార్ అవార్డులను ప్రతి యేటా అందివ్వడం జరుగు తుందని ఆసక్తికల్గి ఉండి అర్హత కల్గిన18 ఏళ్లలోపు బాల బాలికలు జూలై 31లోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా http:// awards.gov.in వెబ్‌సైట్‌లో జూలై 31 లోగా చేసుకోవాలని, వివరాలకు 9032427241 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు..

కాల్వశ్రీరాంపూర్, మే20: మల్యాల మోడల్‌స్కూల్ లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ఫస్ట్ ఇయర్ కొరకు 10వ తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ లో ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం పత్రికాప్రకటనలో తెలిపారు.ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, ఒక్కో గ్రూప్ లో 40 చొప్పున 160 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల25 లోగా ఆన్‌లైన్ లో లేదా, నేరుగా కళాశాల వచ్చి ధరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్‌నెం 991228417లో సంప్రదించాలని సూచించారు.

మిషన్ లైఫ్ స్టైల్‌పై ఉద్యోగులకు అవగాహన

యైటింక్లయిన్ కాలనీ, మే 20: పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అనుసంధానంతో సోమవారం సింగరేణి ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు మిషన్ లైఫ్‌స్టైల్‌పై అవగాహన కల్పించారు. ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ హాజరై మాట్లాడుతూ స్థిరమైన ఆహార వ్యవస్థను అనుసరించాలని, శక్తిని కాపాడే నీటిని పొదుపు చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించడం, చెత్తను తగ్గించి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణం పరిరక్షించడం, సంరక్షించడం అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఏఐటీయూ సీ ప్రతినిధి శాంసన్, అధికారుల సంఘం అధ్యక్షులు మధుసూదన్, ఎస్ఓటు జీఎం వెంకటేశ్వరరావు, రక్షణాధికారి రవీందర్, రాజేంద్రప్రసాద్, ధనుంజయ్య, మురళీకృష్ణ,సురేశ్‌బాబు, షరీఫ్ తదితరులున్నారు.

ఏఎల్పీ గనిని సందర్శించిన సేఫ్టీ జీఎం

ఏఎల్‌పీ గనిని సందర్శిస్తున్న సేఫ్టీ జీఎం

రామగిరి, మే 20: సింగరేణి సంస్థ ఏపీఏ పరిధిలోని అడ్రియాల గనిని సేఫ్టీ జీఎం గురువయ్య సోమవారం సందర్శించారు. ముందుగా ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తాతోపాటు అధికారులతో జరిగిన సమావేశంలో లాంగ్‌వాల్, బోల్టర్ మైనింగ్ పనితీరుపై చర్చించారు. అనంతరం 3 సిమ్ పంచ్ ఎంట్రీ పనులను పరిశీలించి భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. అనుక్షణం, భద్రతతో విధులు నిర్వర్తించాలని నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీరు సీతారామం, ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, భద్రత అధికారి వెంకటరమణ, పీఓ రాజేందర్, రఘురాం, జనార్దన్, ఇతర అధికారులు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

ధర్మారం,మే20:రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జోన్ ధర్మారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మారెడ్డిపల్లి శివారులో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఓ వ్యక్తి నుంచి గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఓవ్యక్తి గుడుంబాతో పట్టుబడగా అతనిది కొత్తపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా రాజేశంగా పోలీసులు గుర్తించారు.రాజేశం గుడుంబా తయారు చేసి ప్యాకెట్లను అక్రమంగా విక్రయించటానికి బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.ప్యాకెట్లలో 15 లీటర్ల గుడుంబా ఉందని గుర్తించిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న గుడుంబాతో పాటు రాజేశంను తదుపరి విచారణ కోసం ధర్మారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఎన్ఆర్ఐ సాయం

ధర్మారం, మే20: కొత్తూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ యాదవ్ తన ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. బొమ్మారెడ్డిపల్లికి చెందిన చంద్రయ్య గుడిసె దగ్ధం కావడంతో పూర్తిగా నిరాశ్రయుడు అయ్యాడు. విషయం తెలుసుకున్న దామోదర్ యాదవ్ నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, వంట సామగ్రి,ఇతర వస్తువులు, 25 కిలోల బియ్యం పంపించగా, సోమవారం వాటిని ఫౌండేషన్ ఇన్‌చార్జి వేల్పుల నాగరాజు బాధితుడు చంద్రయ్యకు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ప్రేమలత తిరుపతిరెడ్డి,మాజీ ఉపసర్పంచ్ జనగామ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావుపల్లిలో ప్రమాద వశాత్తు ఇల్లు దగ్ధం

సుల్తానాబాద్ రూరల్, మే 20: మండలంలోని నారాయణరావుపల్లిలో ప్రమాదవశాత్తు మంటలంటుకుని ఊర కొండయ్యకు చెందిన ఇల్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని కరీంనగర్‌నుంచి ఫైర్ ఇంజన్‌ను తెప్పించి మంటలను ఆర్పించివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.2లక్షల నగదుతోపాటు బంగారం, వెండి, ఆభరణాలు ఖరీదైన బట్టలు మంచంతో పాటు ఇతర నిత్యావసర సామాగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

పెద్దపల్లి టౌన్ : అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అదనపు కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి టౌన్, మే 20: అకాల వర్షాలతో ఐకేపీ కేంద్రాల్లోని వడ్లు తడిసి ముద్దయ్యాయని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు జీ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకేపీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షం కారణంగా రైతుల కు నష్టం వాటిల్లిందన్నారు. రవాణా సౌకర్యం సరిగా లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వడ్లతో పాటు మక్కజొన్న నష్టపోయిన రైతులకు పరిహారం కింద లక్ష చొప్పున, ఆహార పంటలకు రూ. 50వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. మొలకెత్తిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొనుగోలు చేయలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ నాయకులు రత్నకుమార్, వీ సదానందం ఉన్నారు. అనంతరం రైతుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌కు వినతి పత్రం అందజేశారు.

పెద్దపల్లిరూరల్, మే 20: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలులో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పెద్దపల్లి మండలంలోని చీకురాయికి చెందిన పలువురు రైతులు, బీజేపీ నాయకులతో కలిసి సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ జీ శ్యాం ప్రసాద్‌లాల్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి చాలా రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రాల్లో ప్రస్తుతం సన్నరకాలను కొనుగోలు చేయమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన వరి దాన్యం కుప్పలను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్ రాజం మహంత కృష్ణయాదవ్, కావేటి రాజగోపాల్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ చౌరస్తాలో పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

గోదావరిఖని, మే 20: వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే రామగుండం మున్సిపల్ చౌరస్తాలో పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పాలకుర్తి జడ్పీటీసీ, బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి సోమవారం రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి మీదుగా కళాశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో రోడ్డు దాటుతున్నారని, ట్రాఫిక్ అంతరాయం లేకుం డా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఇక్కడ నాయకులు జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షుడు కోడూరి రమేశ్, మిట్టపల్లి సతీశ్, గోపగోని నవీన్, కొమ్ము గట్టయ్య, బానాల స్వామి, మామిడాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో పారదర్శకత పాటించాలి

చర్చాగోష్ఠిలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

కోల్‌సిటీ, మే 20: రామగుండం కార్పొరేషన్‌లో జరగాల్సిన అభివృద్ధిలో పారదర్శకత పాటించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల స్నేహ సాహితీ గ్రంథాలయంలో 'రామగుండం అభివృద్ధి-చర్చించాల్సిన అంశాలు'అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా తోట వేణు మాట్లాడారు. రామగుండంలో ప్రస్తుతం అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతుందని, గోదావరిఖని జనాభా రోజు రోజుకూ తగ్గిపోతున్నా పాలకులు పట్టించుకోకుండా తమ వ్యక్తిగత స్వలాభం కోసం ఇంకా విధ్వంసం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఊరును ఎలా కాపాడుకోవాలో తెలియని నాయకుల అనాలోచిత చర్యల వల్ల రోడ్ల వెడల్పు, కూల్చివేతలు నాణేనికి ఒకవైపు మాత్రమే జరుగుతున్నాయనీ, నగరంలో చాలా చోట్ల విలువైన ఖాళీ భూములు ఆక్రమణకు గురవుతున్నా వాటిని కాపాడటంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. కవి, రచయిత ఏలేశ్వరం వెంకటేశ్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ కానీ, సింగరేణి కానీ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించేలా ఉన్న భవనాలు ఇండ్లు ఖాళీ చేయాలని ముందే నోటీసులు జారీ చేసి చట్టబద్ధంగా పద్ధతిగ నిర్వహించాలని, కానీ అర్ధరాత్రి ఆకస్మికంగా కూల్చివేతలకు పాల్పడటం ప్రజాస్వామ్య విధానం కాదన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్సై పోచయ్య, న్యాయవాదులు రాజ్‌కుమార్, రంజిత్, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ సమావేశం

గోదావరిఖని, మే 20: భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) పెద్దపల్లి జిల్లా కమిటీ సమావేశం సోమవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగింది. జిల్లాలో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు, వారి స్థితిగతులపై చర్చించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ వెంకన్న మాట్లాడారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ కృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి బీ అశోక్, ఉపాధ్యక్షుడు చిలుకశంకర్, సహాయ కార్యదర్శి కొండ్ర మొగిళి, ఎం దుర్గయ్య, బీ బుచ్చయ్య, ఎల్లయ్య, కాదాశి లింగమూర్తి, రవికుమార్, రాజేశం, రమేశ్, రాజేందర్, రాంకీ, కొమురయ్య, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి, మే20: పెద్దపల్లి రంగంపల్లి సబ్ స్టేషన్ లోని టౌన్ -1 ఫీడర్ 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరా యం ఉంటుందని విద్యుత్ శాఖ పెద్దపల్లి ఏడీఈ మాటేటి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా పెద్దపల్లి, రంగంపల్లి, రామచంద్ర మిషన్, భూంనగర్, టీచర్స్ కాలనీ, కూనారం రోడ్, వ్యవసాయ మార్కెట్, తదితర ఏరియాలలో మంగళవారం ఉదయం 7నుంచి 11 గం.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బీరప్ప ఉత్సవాలకు ఎమ్మెల్యే

ఓదెల, మే 20: కనగర్తిలో కురుమ కులస్తులు నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. సోమవారం బీరప్ప-కామరతి కల్యాణ మహోత్సవంలో భాగం